

గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించిన బారికేడ్లు ఇవే

## బారికేడ్లను ఎత్తుకెళ్లిన దొంగలు

జీడిమెట్ల, డిసెంబర్ 5 : ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. జీడిమెట్ల సీఐ ఎం.పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. అసెంబ్లీ ఎన్నికల నిమిత్తం కుత్బుల్లాపూర్ మున్సిపల్ చౌరస్తాలో ట్రాఫిక్ నియంత్రణ కోసం జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రక్రియ అనంతరం వాటిని తరలించేందుకు ట్రాఫిక్ పోలీసులు వచ్చి అక్కడ చూసేసరికి బారికేడ్లు కనిపించకపోవడంతో షాక్‌కు గురయ్యారు. ట్రాఫిక్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా ఈ బారికేడ్లను గుర్తు తెలియని వ్యక్తులు ఆటోలో తరలించినట్లు పోలీసులు గుర్తించారు. ట్రాఫిక్ పోలీసుల ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రైవేటు కళాశాల ప్రిన్సిపాల్ ఆత్మహత్య


సురేశ్ (ఫైల్)

పీర్జాదిగూడ, డిసెంబర్ 5 : ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ ప్రైవేటు కళాశాల ప్రిన్సిపాల్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హన్మకొండకు చెందిన చిగుళ్ల సురేశ్ (39) స్థానికంగా ఎస్పీఆర్ పేరుతో కళాశాలను నడిపేది. అయితే కరోనా సమయంలో కళాశాల నడవక పోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తాయి. దీంతో కళాశాల మూసివేశాడు. గత ఆరునెలల కిందట నగరానికి వచ్చి బోడుప్పల్‌లోని ఎస్ఆర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ స్థానికంగా బాయిస్ హాస్టల్‌లో ఉంటున్నాడు. కాగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న సురేశ్ తీవ్ర మనస్థాపానికి గురై మంగళవారం ఉదయం హాస్టల్ గదిలోని బాత్‌రూంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

## వైద్యఖర్చుల రీయింబర్స్‌మెంట్‌ను చెల్లించాలి

సిటీబ్యూరో, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీలో భాగంగా పాలసీదారుడి వైద్యచికిత్సకు చెల్లించాల్సిన రీయింబర్స్‌మెంట్ రూ.2లక్షల 60వేలు అందజేయాలని న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌ను హైదరాబాద్ వినియోగదారుల కమిషన్-1 ఆదేశించింది. సికింద్రాబాద్ చిలకలగూడకు చెందిన పడాల విద్యాసాగర్ న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ నుంచి గ్రూప్ హెల్త్ పాలసీని తీసుకున్నాడు. కాగా తన తండ్రి అనారోగ్యంతో ఓ ప్రైవేట్ దవాఖానలో అక్టోబర్ 27 నుంచి 29 వరకు 2022లో చికిత్స పొందారు. ఇందుకు గాను రూ.2,00,321 వైద్య ఖర్చులు కాగా.. రూ.1,73,406 మాత్రమే ఇన్స్యూరెన్స్ సంస్థ చెల్లించింది. మిగతా రూ.26,915 చెల్లించకుండా నిరాకరించింది. దీంతో పాలసీదారు వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించి తగిన ఉపషమనాన్ని కోరారు. కమిషన్ అధ్యక్షురాలు బి.ఉమావెంకట సుబ్బలక్ష్మి, సభ్యులు సి.లక్ష్మీప్రసన్న, రాజారెడ్డిలతో కూడిన బెంచ్ కేసును విచారించింది. నిబంధనల ప్రకారం పాలసీదారుడికి రూ.26,915 చెల్లించాల్సిందేనని సదరు బీమా సంస్థను ఆదేశించింది. దీంతో పాటు కోర్టు ఖర్చుల కింద రూ.1000, నష్టపరిహారం కింద మరో రూ.1000 చెల్లించాలని కమిషన్ ఆదేశించింది. 45 రోజుల్లో కమిషన్ ఆదేశాలు పాటించాలని వ్యతిరేక పక్షానికి సూచించింది.

## లారీ ఢీ.. ద్విచక్ర వాహనదారుల మృతి

కీసర, డిసెంబర్ 5 : లారీ ఢీకొని ఇద్దరు ద్విచక్ర వాహనదారులు మృతి చెందిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. కీసర పోలీసుల కథనం ప్రకారం.. కీసర మండలం చీర్యాల్ గ్రామానికి చెందిన కోటయ్య (30), దమ్మాయిగూడకు చెందిన త్రినాథ్ (40) మంగళవారం ఉదయం చీర్యాల్ చౌరస్తా నుంచి కీసర వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. వెనుకనుంచి అతివేగంగా వచ్చిన లారీ ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు త్రినాథ్‌కు ఇద్దరు ఆడ పిల్లలు, కోటయ్యకు ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కీసర పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### వార్షిక నివేదిక తయారీపై

# ట్రై పోలీస్ కమిషనరేట్లలో సన్నాహాలు




సిటీబ్యూరో, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు పూర్తయి కొత్త ప్రభుత్వం కొలువు తీరనుండడంతో ట్రై పోలీస్ కమిషనరేట్ పోలీసులు తమ రోజు వారి విధి నిర్వహణపై దృష్టి సారించారు. ప్రస్తుతం డిసెంబర్ నెల కావడంతో ఈ ఏడాది జరిగిన నేరాలకు సంబంధించిన క్రైమ్ రికార్డులను తయారు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఏడాది పండుగలు, సభలు, సమావేశాలు, ఎన్నికల బందోబస్తుకు ఎక్కువగా సమయం కేటాయించారు. ప్రతి ఏడాది డిసెంబర్ 20వ తేదీ తరువాత ఆయా పోలీస్ కమిషనర్లు తమ పరిధిలో జరిగిన నేరాలకు సంబంధించిన వార్షిక నివేదికను విడుదల చేస్తుంటారు. ఇందులో భాగంగానే క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ఆయా నేరాలు, కేసులకు సంబంధించిన అంశాలపై విశ్లేషణలు చేస్తున్నాయి. ఇప్పటికే ఆయా విభాగాల అధికారులు వార్షిక నివేదిక తయారీపై కసరత్తు మొదలు పెట్టారు. ఈ వార్షిక నివేదికను విడుదల చేసేది కొత్త అధికారులా? ప్రస్తుత అధికారులా? అనే విషయంపై త్వరలోనే స్పష్టత రానున్నది.

## ఉర్సు ఉత్సవాల్లో కత్తి పోట్లు

బండ్లగూడ, డిసెంబర్ 5 : ఉర్సు ఉత్సవాల్లో ఇద్దరు యువకుల మధ్య తలెత్తిన గొడవ కత్తి పోట్లకు దారి తీసింది. ఈ సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జాలల్ బాబానగర్‌లోని దర్గా వద్ద సోమవారం రాత్రి ఉర్సు ఉత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఇద్దరు యువకుల మధ్య గొడవ తలెత్తింది. కోపోద్రిక్తులైన దావుద్, ఇబ్రహింలు షోహెబ్ అనే యువకుడిపై కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో షోహెబ్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సోహెబ్‌ను స్థానిక ఆస్పత్రిలో చేర్పించి దాడికి పాల్పడిన ఎండీ దావుద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనపై ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.


సదస్సును ప్రారంభిస్తున్న వక్తలు

## నేటి యువతరం పైనే.. సమాజ భవిత

*'డియర్ ఫస్ట్ టైం ఓటర్స్ -యూత్ మీటింగ్'లో వక్తలు*

సిటీబ్యూరో, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ): సమాజ భవితవ్యాన్ని మార్చే సత్తా యువతరానిదేనని పలువురు వక్తలు పేర్కొన్నారు. యువతే.. భవిత సీబీఎన్ ఫోరం విజన్- 2047 ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలోని ఎన్‌కేఎన్‌ఆర్ గార్డెన్స్‌లో గురువారం 'డియర్ ఫస్ట్ టైం ఓటర్స్-యూత్ మీటింగ్' సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటిసారి ఓటేసిన వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, విజన్ 2047 సీబీఎన్ ఫక్షరం అధ్యక్షుడు జీనెక్స్ అమర్, జీవీ ఆంజనేయులు, డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, గ్రీష్మ, డాక్టర్ పొగాకు జయరాంచందర్ పాల్గొన్నారు.

## మాదిగ సామాజిక వర్గానికి.. కేబినెట్‌లో సముచిత స్థానం కల్పించాలి


**మాదిగ క్రిస్టియన్ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ నాగళ్ళ పోచయ్య**

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 5 : మాదిగలకు కాంగ్రెస్ పార్టీ మంత్రి పదవులలో సముచిత స్థానం కలిపించాలని మాదిగ క్రిస్టియన్ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ నాగళ్ళ పోచయ్య ఇశ్రాయేల్ డిమాండ్ చేశారు. నాంపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోచయ్య మాట్లాడుతూ వాస్తవ జనాభా ప్రాతిపదికన మంత్రి పదవులు, నామినేటెడ్ పదవులను కేటాయించాలని కోరారు. తెలంగాణలో 65లక్షలు ఉన్న మాదిగ కమ్యూనిటీకి ముఖ్యమంత్రి పదవితో పాటు మంత్రి పదవులు, నామినేటెడ్ పదవులలో సముచిత స్థానం కలిపించాలని డిమాండ్ చేశారు. క్యాబినెట్‌లో సముచిత స్థానం కలిపించకుంటే భవిష్యత్తులో కాంగ్రెస్‌కు సరైన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఇటీవల కొందరు మాదిగ నాయకులు భాజాపా వైపు చూడడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. భాజాపా సమాజానికి ప్రమాదకరమైన పార్టీగా వారు అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ఫ్రంట్ సభ్యులు కటిక దానయ్య, తదితరులు ఉన్నారు.

## హోటల్ రివ్యూస్ పేరుతో రూ.4 లక్షల బురిడీ

సిటీబ్యూరో, డిసెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : పార్ట్ టైం ఉద్యోగంలో భాగంగా ఓటల్ రివ్యూస్ రాయాలంటూ నమ్మించి ఓ గృహిణి వద్ద నుంచి సైబర్ నేరగాళ్లు రూ.3.93 లక్షలు కాజేశారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్ఆర్‌నగర్‌లో నివాసముండే బాధితురాలి ఫోన్‌కు ఈజీ వర్క్ ఉందంటూ ఓ మెసేజ్ వచ్చింది. అందులో గూగుల్ మ్యాప్స్‌లో హోటల్, రెస్టారెంట్లకు సంబంధించిన రివ్యూస్ రాయాలని.., ఒక్కో రివ్యూ రాస్తే డబ్బులొస్తాయంటూ ఉన్నది. ముందుగా రూ.150 పంపిస్తున్నామంటూ నమ్మించారు. ఆ తరువాత టెలిగ్రామ్ లింక్ పంపి ఓ మహిళతో మాట్లాడించారు. ఆమె టాస్క్‌లుంటాయని.. డబ్బులు చెల్లిస్తే ఒక్కో టాస్క్‌కు కొంత డబ్బు వస్తుందంటూ మహిళను నమ్మించింది. బాధితురాలికి మరో లింక్‌ను పంపించి, అందులో రివ్యూస్ రాయిస్తూ, పెట్టిన పెట్టుబడి, వచ్చిన లాభాలు స్క్రీన్‌పై డిస్‌ప్లే చేస్తూ దఫ దఫాలుగా రూ.3.93 లక్షలు కాజేశారు. స్క్రీన్‌పై డబ్బులు కనిపిస్తున్నా, వాటిని డ్రా చేసుకునే వీలు లేకపోవడంతో ఇదంతా మోసమని గుర్తించిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు పోలీసలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





## ఆకట్టుకున్న కిడ్స్ ఫ్యాషన్ షో

బంజారాహిల్స్ రోడ్ నం.10లోని లకోటియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్ ఆధ్వర్యంలో మంగళ వారం ఎవాల్వ్ పేరుతో నిర్వహించిన కిడ్స్ ఫ్యాషన్ షో ఆకట్టుకున్నది. ముద్దులొలికే చిన్నారులు ఆత్మవిశ్వాసంతో విభిన్నమైన డిజైన్లతో డ్రెస్సులు ధరించి ర్యాంప్ వాక్ చేశారు. ఇనిస్టిట్యూట్ ఫ్రెషర్స్ డే -2023 వేడుకల్లో భాగంగా ఈ ఫ్యాషన్ షో నిర్వహించారు. - బంజారాహిల్స్, డిసెంబర్ 5 :